

# కరపత్రం

SINCE 2014

శనివారం నవంబర్ 23 2024 | సంపుటి :0 | సంచిక : 45 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

## అనర్హతపై స్పీకర్‌దే తుది నిర్ణయం

- తగిన సమయంలో నిర్ణయం తీసుకునే అధికారం
- ఐదేళ్ల అసెంబ్లీ కాలం దృష్టిలో పెట్టుకోవాలని సూచన
- నాలుగు వారాల గడువు పెడుతూ ఇచ్చిన తీర్పు కొట్టివేత
- అనర్హత పిటిషన్‌పై హైకోర్టు సిజె ధర్మాసనం సంచలన తీర్పు

2లో



## చురుకుగా తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు పనులు

**పరిశీలించిన సిఎం రేవంత్**

సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు పనులు చురకుగా సాగుఉతన్నాయి. డిసెంబర్ 9న విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం చురుకుగా సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో పనులు జరుగుతున్న తీరును పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.



## చెరువుల ఆక్రమణలపై హైడ్రా దృష్టి



2లో

## త్వరలో ఆదర్శ రైతుల నియామకం: తుమ్మల



తుమ్మలతో చర్చిస్తున్న కోదండరెడ్డి

హైదరాబాద్: వ్యవసాయ కమిషన్ సూచనలకు అనుగుణంగా సాగురంగాన్ని బలోపేతం చేసేందుకు ఆదర్శ రైతుల నియామకం చేపడతామని ఆ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ(ఆత్మ) కమిటీలను సైతం నియమించి, వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి గురువారం తమ సభ్యులతో కలిసి సచివాలయంలో మంత్రిని కలిశారు. కోదండరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి వెయ్యి ఎకరాలకు ఒక ఆదర్శ రైతు నియామకం.. వ్యవసాయానికి ఉపాధిహామీ పథకం అనుసంధానం.. వ్యవసాయ యంత్రాల కొనుగోలుపై జీఎస్టీ తొలగింపు.. విత్తన చట్టంలో మార్పులు.. రైతు ఉత్పత్తి సంఘాల బలోపేతం.. తదితర అంశాలపై విన్నవించారు. ఆదర్శ రైతుల నియామకంపై నివేదిక సమర్పించాలని వ్యవసాయశాఖ అదనపు సంచాలకుడిని మంత్రి ఆదేశించారు. వ్యవసాయాభివృద్ధికి మరిన్ని సూచనలు, సలహాలు ఇవ్వాలని కమిషన్‌ను మంత్రి కోరారు.

## భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు గొప్పవి



2లో

- వాటిని మరింతగా పటిష్టం చేసుకోవాలి
- లోక్‌మంథన్ కార్యక్రమంలో రాష్ట్రపతి పిలుపు
- రెండురోజుల పర్యటన ముగించుకుని ఢిల్లీకి ప్రయాణం

## అదానీకి కట్టబెట్టిన ప్రాజెక్టుల విలువ రూ.2,76,333 కోట్లు



2లో

- ఇదీ జగన్ ప్రభుత్వంతో అదానీ బంధం
- పోర్టుల నుంచి స్మార్ట్ మీటర్ల దాకా
- గనుల్లోనూ.. అదానీదే హవా

## రైతులకు మద్దతు ధర లేదు..

## బోనస్ బోగస్ అయింది: హరీశ్‌రావు

- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు.
- బోనస్ మాట బోగస్ అయిందని.. మద్దతు ధర కూడా రావట్లేదన్నారు.
- ఖమ్మంలో మీడియాతో ఆయన మాట్లాడారు.

2లో



## అదానీతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయాలి: కేటీఆర్



హైదరాబాద్: అంతర్జాతీయంగా మళ్లీ అదానీ వ్యవహారం బయటపడిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అమెరికా నుంచి ఆఫ్రికా వరకు ఇది వెలుగు చూసిందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అదానీ వ్యాపార సామ్రాజ్యం విస్తరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

“మా పార్టీ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు అదానీ తెలంగాణకు రాలేదు. కాంగ్రెస్ అధిష్ఠానానికి తెలియకుండా రేవంత్‌రెడ్డి ఆయనకు రెడ్‌కార్పెట్ పరిచారా? రూ.12,400 కోట్లతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. విద్యుత్‌కు సంబంధించి ప్రాజెక్టులు అదానీకి అప్పగించేందుకు సీఎం ప్రయత్నించారు. స్కిల్ యూనివర్సిటీకి ఆయన రూ.100 కోట్ల విరాళం ఇచ్చారు. వ్యాపారవేత్తలు రూ.40వేల కోట్ల విరాళాలు ఉచితంగా ఇవ్వరని రాహుల్‌గాంధీ అన్నారు. జాతీయ పార్టీకి ఓ జాతీయ విధానం ఉండాలి. అదానీతో చేసుకున్న ఒప్పందాలను కెన్యా రద్దు చేసింది. తెలంగాణ ప్రభుత్వ ఎందుకు ఆ నిర్ణయం తీసుకోవడం లేదు?రాహుల్‌గాంధీకి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయించాలి” అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

## కులం సంపూర్ణం.. ఆర్థికం అర్ధసత్యం.. తేలేది అదేనా?

కులం నిజం! ఆర్థికం అర్ధసత్యం! తెలంగాణ సామాజిక, ఆర్థిక, రాజకీయ, కులగణన సర్వే అందించనున్న దృశ్యం గురించి ఇందుకు భిన్నంగా సూత్రీకరించలేం! కులం గురించి చెప్పటానికి ఇష్టపడని వారూ సర్వేలో ఎదురుపడ్డారు. కులగణనతో ప్రయోజనం లేదని తలచినవారూ అందులో పాల్గొనటానికి ససేమిరా అన్నారు. సర్వే ముందుకెళ్లిన కొద్దీ ఈ ఇరు వర్గాల సంఖ్యా గణనీయంగా పెరగలేదు. సర్వేలో ఏదో విధంగా పాల్గొన్న వారి సంఖ్యే ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. ఇక అనుకున్నట్లుగా సర్వే ముగిసి లెక్కలు కొలిక్కి వస్తే అటుఇటుగా కులాల సంఖ్యాబలం తేలిపోతుంది. ఆమేరకు సర్వే సఫలం అనుకోవచ్చు! ఈ సఫలత వెనుక ఒక ప్రగాఢ విఫలత కూడా కాచుకుని ఉంది. అది సృష్టించే ఇబ్బందులే ప్రధానమైనవి. ఆర్థిక స్థితిగతులకు సంబంధించి లభించే అసమగ్ర చిత్రమే ఆ విఫలతగా భావించొచ్చు. అనుకున్న లక్ష్యాన్ని సర్వే చేరుకోకుండా నిలిపివేసేది ఆ అసమగ్ర చిత్రమే!

ఆర్థిక స్థితిగతులకు సంబంధించిన అసమగ్ర సమాచారంతోనే అసలు చిక్కంతా ఉంది. ఆ సమాచారంతో వివిధ వర్గాల, కులాల నిజ స్థాయిని సరిగా అంచనా వేయలేం. ఒక కులంలో ఆర్థిక అంతరాలను సమగ్రంగా లెక్కించలేని సర్వేతో చాలా విలువైన సమాచారం లభించని పరిస్థితే నెలకొంటుంది. వివిధ రూపాల్లో ఉన్న ఆస్తులు, సంపద గురించి నిజాయితీగా చెప్పే వారి సంఖ్య అంత ఆశాజనకంగా లేదనే సమాచారం క్షేత్రస్థాయి నుంచి అందుతోంది. సర్వే ఆరంభమైన మొదటిరోజు నుంచీ ఆస్తులు, సంపద గురించి విపులంగా చెప్పటానికి విముఖతను వ్యక్తం చేసిన వారు గణనీయంగానే ఉన్నారు. ఈ విముఖత మధ్యతరగతి, ధనికుల్లోనే గాక పెద్దగా ఆస్తుల్లేని వర్గాల నుంచి కూడా వ్యక్తమవుతోంది. ఆస్తులు చెప్పినవారు కూడా మొత్తం సమాచారం ఇచ్చారని భావించలేం. నాలుగు ఆస్తులు ఉంటే ఒకటి రెండు ఆస్తులు చెప్పి సరిపెట్టిన వాళ్లు ఎందరో ఉన్నారు. అంతెందుకు.. వ్యక్తిగత వాహనాల గురించి కూడా సరైన చిత్రం వస్తుందని విశ్వసించలేం. సర్వేలో ప్రజలు వెల్లడించిన వాహనాల సంఖ్యతో రవాణాశాఖ దగ్గర ఉన్న సమాచారంతో పోల్చి చూస్తే పరిమితులేమిటో తెలుస్తాయి. అస్తుబిస్తు ఆస్తులు ఉండి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను అందుకుంటున్న వారు కూడా చాలా చోట్ల సరైన సమాచారం చెప్పిన దాఖలాలు కనపడటం లేదు. ఆస్తులు ఉన్నవి ఉన్నట్లుగా చెబితే పథకాలు అందవన్న భయమూ వ్యక్తమైంది. భూ ఆస్తులకు సంబంధించి సరైన సమాచారం అందిస్తే రెవెన్యూ, రిజిస్ట్రేషన్ రికార్డులతో అది నూటికి నూరుపాళ్లు సరిపోవాలి. పట్టణాలు, నగరాల్లో అది ఎలాగూ జరగని పని! కనీసం గ్రామాల్లోని ఆస్తులకు సంబంధించైనా అట్లా సరిపోయే సమాచారాన్ని ప్రజలు ఇచ్చి ఉంటే ఒక అద్భుతంగా చెప్పుకోవచ్చు.

తెలంగాణలోనే కాదు దేశంలో ఎక్కడ సర్వే చేపట్టినా ఇదే పరిస్థితి ఉంటుంది. ఆస్తుల గురించి ప్రభుత్వాలు అడిగినప్పుడు ప్రజల స్పందన ఇలా ఉండటానికి బలమైన కారణం ఉంది. ఏ చట్టాన్నీ నిజాయితీగా అమలుచేయలేని ప్రభుత్వాలపై ప్రజల అంతరాంతాల్లో అపనమ్మకం గూడుకట్టుకుని ఉంటుంది. ఈ వైఖరి వలసపాలన కాలం నుంచి కొనసాగుతోంది. అధిక శిస్తులు, పన్నులతో ప్రభుత్వాలు ప్రజల్ని పీడించిన చరిత్ర కూడా దీనికి కారణమనే చెప్పాలి. చట్టాలను అతి సంక్లిష్టంగా రూపొందించి అర్థం కాకుండా ప్రజలను హడలెత్తించటంలో మనకెవరూ సాటిరారు. పోనీ చేసిన ఆ చట్టాలను నిక్కచ్చిగా అమలుపరచామా? అంటే అదీ లేదు. చట్టాల అమలు సాఫల్యతా రేటులో మనకు గొప్ప చరిత్ర లేదు. ఈ విషయంలో పాస్‌మార్కులు కూడా మనకు పడవు. భూసంస్కరణలు, వరకట్న నిషేధం, కులవివక్ష, పర్యావరణ పరిరక్షణ, భవన నిర్మాణ అనుమతులు లాంటి అందరికీ తెలిసిన విషయాలపై చట్టాలను తీసుకున్నా ఇదే పరిస్థితి కనపడుతుంది. చట్టాల్లో కఠినత, అమల్లో అసమర్థత.. ఇదే మన అసలైన చరిత్ర! దీన్ని దృష్టిలో ఉంచుకునే ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత గనర్ మిర్డాల్.. భారత్‌లోని ప్రభుత్వ వ్యవస్థను దృఢమైన ఆచరణకు పూనుకోని మెతక రాజ్యం (సాఫ్ట్ స్టేట్)గా వ్యాఖ్యానించారు. ఆస్తుల విషయంలో గోప్యతను పాటించటం మన సంస్కృతిలో భాగమైపోయింది. ఇరుగు దిష్టి.. పొరుగు దిష్టి పేరుతో దాచిపెట్టటం కూడా మనకు అలవాటే. ఇంటి చుట్టూ కన్నుకుట్టే వాళ్లుంటారనే నమ్మకం హిందూ ఆలోచనా విధానంలో సర్వసాధారణమని ప్రముఖ రచయిత నీరద్ సి చౌదరి 45 ఏళ్ల క్రితం చాలా చక్కగా చెప్పారు.

కులాల లెక్కలను అధికారికంగా తేల్చాలన్న డిమాండు బీసీ వర్గాల నుంచి వచ్చింది. దీని లక్ష్యం ఒక్కటే. బీసీల సంఖ్యకు అనుగుణంగా ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు ఉండాలి. వాటిని సాధించాలంటే కులాల లెక్కలు తేలాలి. 1960ల్లోనే రాంమనోహర్ లోహియా 'మేం 60.. మాకు 60' (60 శాతం జనాభా... 60 శాతం రిజర్వేషన్లు) అనే నినాదం ఇచ్చారు. అగ్రకులాల ఆధిపత్యంతో నిండిన కాంగ్రెస్ రాజకీయాలను ఎదుర్కొని బీసీలను సంఘటితపరచటానికి లోహియా పదునుపెట్టిన మార్గమది. ఆ మార్గం ఎన్నో ఎగుడుదిగుడులు చూసినప్పటికీ 1990ల నాటికి మండల్ రాజకీయాల రూపుతీసుకుని కాంగ్రెస్‌ను హిందీ రాష్ట్రాల్లో తీవ్రంగా దెబ్బతీసింది. అప్పటి నుంచీ ఆ ప్రాంతంలో కాంగ్రెస్ పెద్దగా కోలుకోలేదు. అందుకే ఒకనాడు తనను ఓడించిన రాజకీయాలను చేపట్టి మళ్లీ చక్రం తిప్పుతోంది. ఒకనాడు కాదన్నది నేడు అవుననటం రాజకీయాల్లో కొత్తకాదు. ఉదార ప్రజాస్వామ్య విధానాల స్థానంలో సంకుచిత జాతీయవాద ధోరణులు విజృంభించటమే దీనికి నిదర్శనం. నిజానికి బీసీల జనాభా ఎంతో ఎవరికీ తెలియనిది కాదు. అనేక సర్వేల్లో ఇప్పటికే స్పష్టమైంది. 50 శాతానికి కాస్త అటుఇటుగానే వారి జనాభా ఉంటుంది. మండల్ కమిషన్ 52 శాతం బీసీలు (44శాతం హిందువులు, 8 శాతం ముస్లింలు) ఉన్నారని పేర్కొంది. 1931 నాటి జనాభా లెక్కలనూ ఆ తర్వాత 10 ఏళ్లకు పెరిగే జనాభా వృద్ధి రేటుని బట్టి మండల్ కమిషన్ ఆ అంచనాకు వచ్చింది. తెలంగాణ కులగణనలో సంఖ్యాపరంగా అనూహ్యమైన ఫలితాలు వచ్చే అవకాశం లేదు. జనాభా ఇంతని అధికారికంగా తేలితే రాజకీయ పదవులు, ఉద్యోగాలు, విద్యా ప్రవేశాల్లో అంతమేరకు రిజర్వేషన్లను కల్పించాలనే డిమాండు ఊపందుకుంటుంది. ఇక సంఖ్యని బట్టి వాటాలు అందిస్తామనే నినాదాన్ని ఎత్తుకున్న కాంగ్రెస్ పార్టీకి దాని నుంచి తప్పించుకునే అవకాశమూ లేదు. ఒకనాడు బీసీలను ఉపేక్షించి అగ్ర%-%కిందికి కులాల %-% మైనారిటీల త్రైపాక్షిక అండతో రాజకీయ ఆధిపత్యం నడిపిన కాంగ్రెస్ కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే అగ్నిపరీక్షను ఎదుర్కొనబోతుంది. అది కూడా బీసీల నుంచే. ఘనీభవించిన కుల అస్తిత్వాలను ఒక పట్టాన కరిగించలేం. ఎప్పటికైనా అది గడ్డు సమస్యే!

బీసీల సంఖ్యపై అనూహ్యఫలితాలు రావనటానికి తెలంగాణకు సంబంధించి ఒక భూమిక ఉంది. 1931లో ఆనాటి నిజాం రాజ్యంలో సేకరించిన జనాభా సేకరణలో కులాల లెక్కలు స్పష్టంగానే తేలాయి. ఆనాటి తెలంగాణలో 75,54,598 మంది జనాభా ఉన్నారు. అందులో ముస్లింలు 9 శాతం ఉంటే అగ్రకులాల జనాభా 7,36,421 మాత్రమే. విన్నాదితశా అగ్రకులాలను పరిగణనలోకి తీసుకున్నా కూడా మొత్తం హిందువుల్లో వారు 11%-%12 శాతం లోపే ఉంటారు. ఇక మాలలు (4,81,722), మాదిగలు (7,72,680), గిరిజనులు (3,99,061) జనాభా 16,53,463 మందిగా తేలింది. అగ్రకులాలు, ఎస్సీ%-%ఎస్టీ, ముస్లింలు, క్రైస్తవులను కూడిచూస్తే మొత్తం 32,13,083 మంది అయ్యారు. వీళ్ల మినహా మిగతా వాళ్లందరినీ బీసీలుగా పరిగణిస్తే వారు 43,41,515 మంది ఉన్నారు.

# అనర్హతపై స్పీకర్‌దే తుది నిర్ణయం

మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై షెడ్యూలు ఖరారు చేయాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సీజే ధర్మాసనం కొట్టేసింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించింది. నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌దేనని కూడా స్పష్టం చేసింది. 10వ షెడ్యూల్ ప్రకారం అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలంది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, ఐదేళ్ల అసెంబ్లీ గడువును దృష్టిలో ఉంచుకొని స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. భారాస తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరడంతో వారిపై అనర్హత వేటు వేయాలంటూ భారాస ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కె.పి.వివేకానంద్‌లు పిటిషన్లు దాఖలు చేశారు. వీటితోపాటు దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. అనర్హత పిటిషన్లను స్పీకర్ స్వీకరించకపోవడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. సెప్టెంబరు 9న దీన్ని విచారించిన సింగిల్ జడ్జి.. 4 వారాల్లో అనర్హత పిటిషన్లపై షెడ్యూలు ఖరారు చేయాలని తీర్పు వెలువరించారు. సింగిల్ జడ్జి తీర్పును సవాలు చేస్తూ హైకోర్టులో అసెంబ్లీ కార్యదర్శి వి. నరసింహాచార్యులు దాఖలు చేసిన అప్పీళ్లపై ఇటీవల వాదనలు ముగియగా తీర్పును వాయిదా వేసింది. తాజాగా స్పీకర్ తీసుకోవాలంటూ శుక్రవారం ఉన్నత న్యాయస్థానం తీర్పును వెలువరించింది. దీంతో జంపింగ్ జపాంగ్‌లకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు పిటిషన్ వేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై 4 వారాల్లోగా టైం ఫ్రేమ్ ఫిక్స్ చేయాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం వినోద్ కుమార్‌కు సింగిల్ బెంచ్ ఆదేశించింది. సింగిల్ బెంచ్ ఆదేశాలను సవాలు చేస్తూ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అసెంబ్లీ కార్యదర్శి అప్పీల్ చేశారు. అసెంబ్లీ కార్యదర్శి రిట్ అప్పీల్‌పై హైకోర్టు తీర్పు ప్రకటించింది. స్పీకర్ తుది నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. స్పీకర్‌కు ఏలాంటి నిర్దిష్ట సమయం అంటూ లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. తగిన స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు కొట్టేసింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై 10వ షెడ్యూల్ ప్రకారం నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు సీజే ధర్మాసనం సూచించింది

# భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు గొప్పవి

మొదటిపేజీ తరువాయి

భారతీయ సంస్కృతి, ఆచారాలను నిరంతరం పటిష్ఠం చేయాల్సి ఉందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. హైదరాబాద్‌లోని శిల్పారామంలో లోకమంథన్ ప్రధాన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. దేశ ప్రజల్లో సాంస్కృతిక, స్వాభిమాన్ భావన నెలకొల్పాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రాలను బలోపేతం చేసే దిశగా లోక్ మంథన్ కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. '2018లో రాంచీలో లోకమంథన్ కార్యక్రమంలో పాల్గొన్నా. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పటిష్ఠానికి ఈ ప్రయత్నం గొప్పది. ఇందులో పాల్గొంటున్న ప్రతి ఒక్కరిని అభినందిస్తున్నా. భిన్నత్వంలో ఏకత్వం భారతీయ సంస్కృతిలో భాగం. ఇది ఇంద్రధనస్సులోని సౌందర్యాన్ని సూచిస్తుంది' అని ద్రౌపది ముర్ము అన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను బలోపేతం చేసే గొప్ప కార్యక్రమం అని లోక్ మంథన్ అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. భారతదేశ సంస్కృతి, ఆహార వ్యవహారాలు, మన వారసత్వ చాలా ఘనమైనవి అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం గురించి మాట్లాడతాం.. పాటిస్తాం అన్నారు. ఇదే మన బలం, ఇదే మన స్థైర్యం అని తెలిపారు. ఇన్ని భిన్న సంస్కృతులు ఒకేచోట ఉండటం నిజంగా చాలా గొప్ప విషయం అన్నారు. ఇవన్నీ కలిసిన సుందరమైన ఇంద్రధనస్సు లాంటి దేశం మనదన్నారు. వనవాసి,




నగరవాసి అని లోకమంథన్ కార్యక్రమంలో.. అహల్యాబాయ్ హోల్కర్, రాణి రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వీరాంగనల పై ప్రదర్శనలు నిర్వహిస్తున్నారని తెలిసి హర్షం వ్యక్తం చేశారు. వారి ప్రేరణ ఎప్పటికీ మనకు అవసరం అన్నారు. విదేశాల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తుండటం అభినందనీయం అన్నారు. ఇండోనేషియా సహా వివిధ దేశాల ప్రతినిధులు ఈ వేదిక ద్వారా తమ సంస్కృతిని ప్రదర్శిస్తుండటాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని తెలిపారు. భారతదేశ ఆధ్యాత్మిక భావనలు, కళలు, సంగీతలు, విద్య, వైద్య విధానాలు ప్రపంచవ్యాప్తంగా గౌరవాన్ని పొందాయన్నారు. ప్రపంచానికి మనం జ్ఞాన దర్శనం చేశామన్నారు. ప్రపంచమంతా ప్రస్తుత సమయంలో మళ్లీ భారతదేశ జ్ఞానాన్ని పంచాల్సిన అవసరం ఏర్పడింది. విదేశీ శక్తులు శతాబ్దాలుగా మన మీద జులూం ప్రదర్శించాయి. మన సంస్కృతిని, భాషను, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను విధ్వంసం చేశాయి. మనలో ఐకమత్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారని తెలిపారు. మనలో బానిస మూలాలను చొప్పించారన్నారు. కానీ మన దేశ ప్రజలు సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ.. వీటిని నిరంతరం జీవింపజేశారన్నారు. ఇకపైనా వీటిని కొనసాగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. భారతదేశం బానిసత్వ మూలాలను తొలగించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. రాజ్ పథ్ పేరు కర్తవ్యపథ్ మారిందన్నారు. దర్బార్ హాల్ పేరు.. గణతంత్ర మండప్ గా మార్చామన్నారు. ఇది బానిసత్వ ఆలోచనలను తొలగించే దిశగా జరుగుతున్న ప్రయత్నం అన్నారు. మన ఆలోచనలు కూడా మారాలని తెలిపారు. ఇటీవల.. ఓ హైకోర్టులో మహిళా జడ్జి విగ్రహాన్ని ప్రారంభించారన్నారు. కానీ ఆ విగ్రహం కళ్లకు నల్లని గంతల కట్టలేదని, ఇది మనం సాధిస్తున్న మార్పుకు సంకేతం అన్నారు. మన ఆలోచనలు కూడా మారాలని తెలిపారు. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలమన్నారు. ఐకమత్యం, సమరసతే మన సత్యత.. మన భవిష్యత్తు అన్నారు. ఈ దిశగా మనమంతా కలిసి పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. లోక్ మంథన్ కార్యక్రమం అనంతరం బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుగు ప్రయాణం అయ్యారు. నేటితో రాష్ట్రపతి రెండు రోజుల పర్యటన ముగిసింది.

# అదానీకి కట్టబెట్టిన ప్రాజెక్టుల విలువ రూ.2,76,333 కోట్లు

మొదటిపేజీ తరువాయి

జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని 'అదానీప్రదేశ్'గా మార్చేసింది. భారీ పోర్టుల నుంచి.. ఇళ్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రాజెక్టు వరకు అన్నీ అదానీ పరం చేసింది. ఐదేళ్లలో పోర్టులు.. పంప్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టులు (పీఎస్‌పీ), సౌర విద్యుత్ ప్రాజెక్టులు, డేటా సెంటర్లు, ఇళ్లకు స్మార్ట్ మీటర్లు.. చివరకు థర్మల్ కేంద్రాలకు బొగ్గు సరఫరా టెండర్లనూ గంపగుత్తగా అదానీ సంస్థకు కట్టబెట్టింది. ఐదేళ్లలో ఒకే సంస్థకు జగన్ ప్రభుత్వం కట్టబెట్టిన ప్రాజెక్టుల విలువ రూ.2,76,333 కోట్లు. మరో గుత్తేదారు లేరన్నట్లు.. అదానీ తప్ప మరొకరికి సాధ్యం కాదన్నట్లుగా జగన్ ప్రభుత్వం వ్యవహరించింది. ఆ సంస్థకు భారీ ప్రాజెక్టులను కట్టబెట్టడం వెనుకా జగన్ తన నైజాన్ని చూపారు. తొలుత ఆ సంస్థ ఒప్పందాలను కొనసాగించే విషయమై హైడ్రామా నడిపించి.. తర్వాత రూ.లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను కట్టబెట్టారు. ఈ స్థాయిలో ప్రాజెక్టులు కట్టబెట్టడం వెనుక ఉన్న 'జగన్.. అదానీ' రహస్య బంధంపై ఆరోపణలు ఉన్నాయి. ప్రాజెక్టుల కేటాయింపు వెనుక ప్రభుత్వ పెద్దలకు భారీ మొత్తంలో ముడుపులు అందాయన్నది వాస్తవమేనని తేలింది.

**మొదట బెదిరింపు.. ఆ తర్వాత అప్పగింత!**

జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చీ రావడంతోనే.. రూ.70వేల కోట్ల పెట్టుబడులతో డేటా సెంటర్ ఏర్పాటుకు అప్పటి తెదేపా ప్రభుత్వంతో (2014−19 మధ్య) అదానీ సంస్థ కుదుర్చుకున్న ఒప్పందాన్ని కుదిస్తున్నట్లు డ్రామాకు తెరతీసింది. 'భూములు తీసుకుని కూర్చుంటే కాదు. నిర్దిష్ట ప్రతిపాదనలతో రావాలి. పెట్టుబడులు ఎంత? ఎంత వ్యవధిలో ప్రాజెక్టు

## రైతులకు మద్దతు ధర లేదు.. బోనస్ బోగస్ అయింది: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

"పత్తిలో ప్రతి క్వింటాకు రైతుకు రూ.1500 నష్టం వాటిల్లుతోంది. ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టడం, కుట్రలు చేయడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది జీరో. వరి, పత్తి పంట దళారుల పాలవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోంది? రైతుబంధు, మద్దతు ధర లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పత్తికి గరిష్ఠంగా రూ.11 వేలు, కనిష్ఠంగా రూ.9 వేల ధర పలికింది. ఇప్పుడు ఎందుకు ధర తగ్గింది? పత్తి రైతులకు మద్దతు ధర రావాలి.. రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఆంధ్రా దళారులు ధాన్యం కొంటున్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ మాటలకు తేడా ఉంటోంది. ఖమ్మం జిల్లా మంత్రులు ఆధిపత్యం కోసం బాగా బిజీ అయ్యారు. ప్రజాసమస్యలను గాలికొదిలి గొప్పలకు పోతున్నారు" అని హరీశ్‌రావు విమర్శించారు.ం


# చెరువుల ఆక్రమణలపై హైడ్రా దృష్టి

మొదటిపేజీ తరువాయి

అధికారులతో కీలక సమావేశంలో నిర్వహించిన రంగనాథ్

ఇకపై చెరువుల అన్యాక్రాంతం కాకుండా హైడ్రా చీఫ్ రంగనాథ్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. హైడ్రా ఈ ఏడాది జులైలో ఏర్పడింది.. అర్బన్ డిజాస్టర్స్, ఎంక్రోచ్ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. శుక్రవారం బుద్ధ భవన్ హైడ్రా కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు కమిషనర్ రంగనాథ్ కీలక సమావేశం నిర్వహించారు. రెవెన్యూ ఈఎన్సీలు, ఇరిగేషన్ సీఈలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీనియర్ అధికారులతో సమీక్ష సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కనుమరుగైన చెరువులపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. చెరువులకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను అధికారులు నిర్ణయించారు. 'ఐఎండీ 1875లో ఏర్పడింది. హైడ్రా జీహెచ్ఎంసీలో భాగం కాదు. ఇది వరకు ఈవీడీఎం పేరుతో జీహెచ్ఎంసీలో భాగంగా ఉండేది.. అప్పుడు ఐపీఎస్లు, కమిషనర్లు ఉండేవారు. ఇప్పుడు సెపరేట్ వింగ్‌గా ఏర్పడింది. హైడ్రాకు మొదటి కమిషనర్‌గా ఉండటం సంతోషంగా ఉంది.దేశంలోనే మొదటి సారి హైడ్రా తీసుకొచ్చారు. కేవలం జీహెచ్ఎంసీలో మాత్రమే కాకుండా చుట్టుపక్కల ఉన్న మరో 27 మునిసిపాలిటీల పరిధిలో హైడ్రా పనిచేస్తుంది.. వాటర్ బాడీస్, గవర్నమెంట్ ల్యాండ్స్, పబ్లిక్ అసెట్స్, లేక్స్ ఆక్రమణలకు గురవుతున్నాయి.. వాటికోసం హైడ్రా పనిచేస్తుంది. హైదరాబాద్ అంటేనే గొలుసు కట్టు చెరువులు.. ఒక చెరువుకు మరో చెరువుకు కనెక్టివిటీ ఉండేది..ఇప్పుడు కనెక్టివిటీ లేదు. నాలాలు కూడా సరిగా లేవు. గట్టి వర్షం పడితే ముంపుకు గురవుతాయి..దివి సీమ ఉప్పెన వచ్చినప్పుడు 10వేల మంది చనిపోయారు. పేదరికం వల్ల చాలామంది ముందస్తు సమాచారం లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోయారు.

'ఐఎండీ వల్ల ముందే ఊహించగలుగుతున్నారు.. డిజాస్టర్స్‌లో కూడా మార్పులు వస్తున్నాయి..దేశంలో అర్బనైజేషన్ పెరుగుతుంది.తెలంగాణలో అర్బనైజేషన్ పెరుగుతుంది. వెహికిల్ పాపులేషన్ 80 లక్షలుగా ఉంది. సిటీ ట్రాఫిక్ అడిషనల్ సీపీగా కూడా ఉన్నాను. 2, 3 సెంటిమీటర్ల వర్షం పడితే మూడు, నాలుగు గంటలు ట్రాఫిక్ జామ్ అవుతుంది. మెట్రో సిటీలలో వాతావరణ మార్పులు ఎక్కువగా ఉన్నాయి. క్లౌడ్ బరస్ట్ కూడా పెరుగుతున్నాయి. నాలాలు, చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి.. వర్షం పడినప్పుడు వరద నీరు ఇంకడానికి చాలా సమయం పడుతుంది. సాయంత్రం 4, 5 గంటలకు వర్షం పడితే భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది.. ఆ నీరు ఇంకడానికి మార్గాలు లేవు.. సిటీలో 150 వాటర్ లాగింగ్ ఉన్నాయి. అర్బన్ డిజాస్టర్‌ల మీద ఫోకస్ పెట్టాలి.157 ఏడబ్ల్యూఎస్ స్టేషన్స్ ఉన్నాయి.. ఇంకా కావాలి. ప్రతి 15నిమిషాలకు బెంగుళూరులో ఏడబ్ల్యూఎస్ స్టేషన్ల



నుంచి డేటా కలెక్ట్ చేస్తారు.. మనం కూడా దీనికి మారాలి. సిటీలో వెదర్ రెడర్స్ కావాలి..జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి హిల్ ఏరియాల్లో పెట్టాల్సిన అవసరం ఉంది. వెదర్ అలర్ట్స్ స్పెసిఫిక్‌గా ఉండాలి. ఇక్కడ వర్షం పడుతుందని కాకుండా ఇక్కడ పడదని చెప్పేలా వెదర్ అలర్ట్ ఉండాలి. వర్షాలు పడుతున్నప్పుడు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడం వల్ల ఎకనామికల్ లాస్ కూడా ఏర్పడుతుంది.. హైడ్రా, ఐఎండీతో కలిసి పనిచేస్తుంది. అర్బన్ డిజాస్టర్స్ కో సంబంధించి ఐఎండీతో కలిసి పనిచేస్తాం. నేను మెకానికల్ ఇంజనీరిని, అయినా వీటి గురించి తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాను. ప్రజలు వెదర్ అలర్ట్స్ సీరియస్‌గా తీసుకునేలా హైడ్రా పని చేస్తుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.

# పార్లమెంట్ లో వక్ఫ్ సవరణల బిల్లును అడ్డుకోవడానికి అదానీ ఆయుధమా !

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్.**

రేపటి నుండి 25 నవంబర్ నుండి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం అవుతున్నాయి. ఈ సమావేశాల్లో వక్ఫ్ చట్ట సవరణల బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్నదని వార్తలు వినిపించాయి. ఈ బిల్లును అడ్డుకోవడానికి కాంగ్రెస్ పార్టీకి,రాహుల్ గాంధీకి ఒక సాకు కావాల్సి ఉంది. వక్ఫ్ బిల్లుకు సపోర్ట్ చేస్తే ముస్లింలతో తలనొప్పి, వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తే హిందువులతో తలనొప్పి. కాబట్టి శీతాకాల సమావేశాలను అడ్డుకోవడానికి,పార్లమెంట్ సమావేశాలు భంగం చెయ్యడానికి ఒక కారణం కావాలి. కాబట్టి దేశం బయట నుండి రాహుల్ గాంధీకి కాంగ్రెస్ పార్టీకి ఒక ఆయుధాన్ని అందించడానికి అమెరికా అదానీ అంశాన్ని సృష్టించింది అని ఆప్ కీ అక్బార్ సంపాదకుడు శ్రీ ప్రదీప్ సింగ్ ఒక వీడియో ప్రెజెంటేషన్ లో చెప్పారు. 1984లో భోపాల్ లో ప్రపంచంలోనే అతిపెద్ద పారిశ్రామిక విపత్తు జరిగి వేలాది మంది భారతీయులు చనిపోతే అమెరికన్ పారిశ్రామిక వేత్త వారెన్ ఆండర్సన్ ను ప్రత్యేక విమానంలో దేశం దాటించిన కాంగ్రెస్ పార్టీ అదానీ విషయంలో మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. భారత దేశ




అంతర్గత విషయాల్లో అమెరికా కోర్టులో కేస్ వేయడం ఒక కుట్ర అని ప్రదీప్ సింగ్ అన్నారు. పోయిన సారి కూడా పార్లమెంట్ ను స్తంభింప జేయడానికి మణిపూర్ కుకీ అంశంతో పార్లమెంట్ కార్యకలాపాలను ప్రతిపక్షాలు స్తంభింప జేసాయని అన్నారు. మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ఎలాగైనా అవినీతి ముద్ర వేయాలని కాంగ్రెస్ సహా విపక్షాలు చెయ్యని ప్రయత్నం లేదు. రాఫెల్ యుద్ధ విమానాలు మొదలుకొని చాలా అంశాలతో మోడీ ఇమేజ్ దెబ్బతీయడానికి కాంగ్రెస్ మరియు మిత్ర పక్షాలు తీవ్ర ప్రయత్నం చేశాయి. కేంద్ర ప్రభుత్వానికి బీహార్ నితీశ్,ఆంధ్ర ప్రదేశ్ చంద్రబాబు ల మద్ధతు అవసరం. మోడీకి వీళ్ళద్దరినీ దూరం చెయ్యడానికి అమెరికా డీప్ స్టేట్ చాలా ప్రయత్నాలు చేసింది. కాని మోడీ తన పద్ధతిలో దూసుకు పోతూనే ఉన్నాడు. ఏపి లో జగన్ మోహన రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్న కాకంలో జరిగిన అవినీతి అని ప్రచారం చేస్తే టీడీపి చంద్ర బాబు తనతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తాడని మోడీ వ్యతిరేక అంతర్జాతీయ లాబి పన్నిన కుట్ర ఇదని ప్రదీప్ సింగ్ వివరించారు. మోడీ వ్యక్తిగత చరిత్ర నిష్కల్మషమైనది. ఎలాగైనా ఈ ఇమేజ్ ను దెబ్బతీయడానికి కాంగ్రెస్ చెయ్యని ప్రయత్నం లేదు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల ఫలితాల సరళితో అప్రమత్తమైన మోడీ మరింత శక్తితో భారత వ్యతిరేక శక్తుల కుట్రలను తుత్తినియలు చేస్తూ సాగుతున్నాడు. అమెరికా డెమొక్రాట్లు సృష్టించిన డీప్ స్టేట్ అమెరికా గడ్డ పైనే తునాతునకలు అయ్యింది. నిన్నటి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్ధి కమలా హారిస్ ఓటమితో అమెరికా డీప్ స్టేట్ గ్యాంగ్, మనదేశం లోని లెఫ్ట్ లిబరల్ ముఠాలు నిశ్చేష్టులయ్యారని, గెలిచిన రిపబ్లికన్ పార్టీ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టే లోపు మోడీని సాధ్యమైనంత వరకు నిలువరించాలని ఒక కుట్ర జరిగిందని ప్రదీప్ సింగ్ అన్నారు. అమెరికాలో ఇంధనం, మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రాజెక్టుల్లో రూ. 84,492 కోట్ల (10 బిలియన్ డాలర్లు) పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నట్లు అమెరికా కొత్త అధ్యక్షుడిగా డోనల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత భారత పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ప్రకటించారు. ఇది డెమోక్రాట్లకు కంటగింపుగా మారిందని ప్రదీప్ సింగ్ అన్నారు. భారత్ గ్లోబల్ పవర్ మారడం ఇష్టం లేని ఈ శక్తుల కుట్ర ఇదని అన్నారు. ప్రపంచ శక్తిగా భారత్ ఎదగకుండా అడ్డుకోవాలని మన దేశ ఆర్థిక కేంద్రాలను దెబ్బతీయాలని విదేశీ శక్తులు కుట్రలు చేస్తూనే ఉన్నాయని ప్రదీప్ సింగ్ అన్నారు. అమెరికాలోని పెట్టుబడి దారులు అదానీ కంపెనీల్లో పెట్టుబడి పెట్టారని, ఈ లంచాల వ్యవహారంలో అమెరికా ఇన్వెస్టర్ల ప్రయోజనాలు దెబ్బతింటాయని అమెరికా కోర్టులో కేసు వేయడం, సరిగ్గా పార్లమెంట్ సమావేశాలకు 3 రోజుల ముందు ఈ అంశాన్ని ప్రచారం చెయ్యడం,ఇక్కడ భారత్ లో దాని ఆధారంగా కాంగ్రెస్ దాని మిత్ర పక్షాలు అల్లరి చెయ్యడం మొదలయ్యింది అని శ్రీ ప్రదీప్ సింగ్ అన్నారు. నిన్న గాక మొన్న అంతర్జాతీయ నేర కోర్టులో ఇజ్రాయిల్ పై, అధ్యక్షుడు నెతన్యాహు పై కేసు వేయడం ఒక కొత్త ధోరణి మొదలయ్యింది అన్నారు. ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు ముందే కాంగ్రెస్ బ్యాండ్ బాజాతో సిద్ధమవుతున్నదని. పార్లమెంట్ సమావేశాల్లో ప్రజా సమస్యలు,దేశ సమస్యలు చర్చకు రాకుండా అడ్డుకోవడానికి మోడీ కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక పక్షాలు రణగొణ ధ్వనులతో సిద్ధమవుతున్నది. పార్లమెంట్ లో స్వంత మెజారిటీ లేని బిజెపి ఈ సవాళ్లను ఎలా ఎదుర్కోబోతున్నదో చూడాలి అని ప్రదీప్ సింగ్ అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదానికి అదానీ అంశాన్ని అడ్డంగా ఎర వేసిన అమెరికా ఆయుధాన్ని ప్రతిపక్షాలు ఎలా వాడుకుంటాయో చూడాలని అన్నారు. ఈ అదానీ అంశంలో ఇప్పటివరకు చంద్రబాబు గాని, పవన్ కళ్యాణ్ గాని, బీహార్ నితీశ్ కుమార్ గాని ఎలాంటి కామెంట్ చెయ్యలేదు. ఇక మిగతా సినిమా పార్లమెంట్ తెరమీద చూడాల్సిందే అని ప్రదీప్ సింగ్ అన్నారు.

## నూతన వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి



కరపత్రం న్యూస్ : ఖమ్మం, నవంబర్ 22

పాలేరు నియోజక వర్గం కూసుమంచి మండలం చేగోమ్మ గ్రామంలో బొల్లం నాగేశ్వరరావు, రజిత దంపతులకు చెందిన వినాయక వాటర్ ప్లాంట్ ను కూసుమంచి క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం రోజు నూతనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... చేగోమ్మ గ్రామ ప్రజలకు, మంచి తాగునీటిని అందించాలని. అలాగే మీ యొక్క వ్యాపారం మంచిగా జరగాలని ఆయన ఆకాంక్షించారు. నా బొల్లం నాగేశ్వరరావు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో.... కూసుమంచి మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, మాజీ సర్పంచ్ భారీభద్రం, నేలకొండపల్లి మండల వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్ కొండపర్తి సురేష్, చేగోమ్మ మాజీ ఉపసర్పంచ్ బత్తుల నాగేశ్వరరావు, అరవపల్లి జనార్ధన్, మద్దినేని వెంకన్న,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్పీ రాములు కు ఘన సన్మానం.

**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, నవంబర్ 22**



. జగిత్యాల జిల్లా మెట్పల్లి సబ్ డివిజన్ పోలీస్ అధికారిగా ఇటీవల బదిలీపై వచ్చిననూతన డీఎస్పీగా భాద్యతలు స్వీకరించిన అద్లూరి రాములను శు క్రవారం మెట్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఖుతుబోద్దిన్ పాషా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ మాట్లాడుతూ శు క్రవారం డీఎస్పీ రాములును కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించడం నాకు ఎంతగానో ఆనందాన్ని ఇచ్చిందని అన్నారు. అధికారులతో సత్సంబంధాలు పెంచుకుంటే మునుముందు మంచి కార్యక్రమాలు చేపట్టొచ్చని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ తో పాటు కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కుతు బో ద్దీన్ పాల్గొని డిఎస్పీకి

## విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

**కరపత్రం రామగుండం నవంబర్, 22:**



రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ ఐపిఎస్., ఐజి ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటరమణ ఉత్తర్వుల ప్రకారం ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల బాయ్స్ గోదావరిఖని లో విద్యార్థులకు సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ ఆధునిక టెక్నాలజీ కాలంలో సెల్ ఫోన్ వినియోగం పెరిగిపోయిందని అన్నారు. ప్రతినిమిషం సెల్ ఫోన్ లేనిది ఏ పని చేయలేకపోతున్నామని, ప్రతిదీ కూడా సెల్ ఫోన్ తోనే లింక్ ఉండడంతో మన సెల్ ఫోన్ నెంబర్ కూడా మన బ్యాంక్ అకౌంట్, పాన్ కార్డ్, ఆధార్ కార్డు, పెన్షన్, పౌరసరఫరాల వినియోగానికి సంబంధించి అన్ని విధాలుగా మన సెల్ ఫోన్ నెంబర్ అవసరం ఉంటుందని అన్నారు. దాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మనకు ఏదో లేనిపోని ఆశలు చూపించి అదేవిదంగా కొత్తగా పెళ్లి కార్డ్స్ ఏ పి కే ఫైల్స్, డిజిటల్ అరెస్ట్ అని సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. సైబర్ నేరాల పట్ల, ర్యాగింగ్, సైబర్ క్రైమ్, మత్తు పదార్ధాలు డ్రగ్స్ వంటి తదితర అంశాల పై యువత, విద్యార్థునులకు పూర్తిగా అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఇటీవల కాలంలో మహిళలు పిల్లలను టార్గెట్ చేసుకొని సైబర్ నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. యువత ఇంటర్నెట్ పరిమితికి మించి వాడకూడదని, సైబర్ నేరగాళ్ళు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులను కాజేస్తున్నారని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు మీకు ఫోన్ చేసి మీ ఏటీఎం, పిన్ నెంబర్ , సీవీవీ, బ్యాంకు ఖాతా తదితర వివరాలు కోరితే ఇవ్వరాదన్నారు. ఎవరైనా మీకు లాటరీ తగిలింది, కొంత డబ్బును సూచించిన బ్యాంకు ఖాతాలో జమచేయాలని ఫోన్ కాల్ వచ్చినా, ఏ విధంగా అయినా మీరు మీ బ్యాంకు ఖాతా నుండి డబ్బును కోల్పోతే వెంటనే సమీప పోలీస్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎలాంటి ఆపద సమయంలో సైబర్ నేరాల పట్ల డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. సైబర్ క్రైమ్. జి ఓ వి. ఇన్ కి గాని టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి లేదా 100 లకు ఫోన్ చేసి పోలీసుల సేవలు పొందాలని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## డిసెంబర్ 1న హైదరాబాదు లో జరిగే మాల సింహగర్జన సభను జయప్రదం చేయండి



– మాలల సింహ గర్జన కరపత్రాలు పోస్టర్ ఆవిష్కరణ

**కరపత్రం న్యూస్ : ఖమ్మం,నవంబర్ 22:**

డిసెంబరు 1 వ తేదీన హైదరాబాదులో సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో జరిగే మాల మాల ఉపకులాల బహిరంగ సభను జయప్రదం చేయాలని శుక్రవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో మాల మహానాడు మండల అధ్యక్షులు పప్పుల ప్రసాద్ అధ్యక్షతన కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా కార్యదర్శి పాలేరు నియోజకవర్గ ఇన్చార్జి గుమ్మడి కనకరాజు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పు ను వ్యతిరేకించాలని కోరారు. డిసెంబర్1న జరిగే మాలల సింహ గర్జన భారీ బహిరంగ సభకు ప్రతి గ్రామం నుండి ప్రతి ఒక్క మాల వేలాదిగా తరలిరావాలనిఅన్నాను. వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ రేపు జరగబోవు సభ ప్రాంగణం లో మాలలు సింహాలై గర్జించిసవాగా ఉండాలని కోరుకుంన్నారు. మెట్టు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రేపు డిశంబర్ నెలలో జరిగే మాలల సింహగర్జన మీటింగ్ లో ప్రతి ఒక్క మాల కుటుంబ సభ్యులు అందరు కలిసి మాట్లాడుకొని రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాల మహానాడు నాయకులు మెట్టు వెంకటేశ్వర్లు వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి శ్రీనివాస్ తిరుమలాయపాలెం మండల అధ్యక్షులు పప్పుల ప్రసాద్ మండల ప్రధాన కార్యదర్శి కాశిమల్ల మహేందర్ నూక తొట్టి సాల్మన్ పప్పుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

## సెక్యూరిటీ నూతన జియం గా సిహెచ్ లక్ష్మీనారాయణ



**కరపత్రం రామగుండం నవంబర్, 22:**

సెక్యూరిటి నూతన జియం గా పదవి బాధ్యతలు చేపట్టిన శ్రీ సి. హెచ్ లక్ష్మీనారాయణ మొదటి సారిగా రామగుండం ఏరియా-1 కు వచ్చిన సందర్భంగా శుక్రవారం ఆర్జీ. 1 జియం కార్యాలయం నందు వారిని యస్.ఓ.టు జియం గోపాల్ సింగ్, మరియు ఇతర అధికారులు వారికి స్వాగతం పలుకుతూ పూల బోకే అందజేసి శాలువాతో సన్మానించటం జరిగింది. ఈ సందర్భంగా వచ్చిన సెక్యూరిటి జియం ఆర్జీ. 1 ఏరియాలో భద్రత విభాగం ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి ఆధ్వర్యంలో అన్ని గనులు డిపార్ట్మెంట్లో తనిఖీ చేసినారు. జిడికె 5 ఓసి దగ్గర ఉన్న స్క్రాప్ యాడ్ ను పరిశీలించినారు. ఏరియా వర్క్ షాప్ వద్ద ఉన్న స్క్రాప్ మరియు కేబులను పరిశీలించి కాంపౌండ్ వాల్ పైన రక్షణ కొరకు బార్ బుడ్ ఫెన్సింగ్ వేయాలని కాంపౌండ్ ఇరువైపులా చెట్లను బుషెస్ ను తొలగించాలని సూచించారు. ఈ సందర్భంగా సెక్యూరిటి నూతన జియం సి. హెచ్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రక్షణ భద్రత విషయంలో రాజి పడకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్స్ కిరణ్ బాబు, రవీందర్ రెడ్డి, ఎన్విరాన్మెంట్ అధికారి అంజనేయప్రసాద్, సీనియర్ పి.వో శ్రావణ్ కుమార్, యస్. అండ్. పి.సి సీనియర్ సెక్యూరిటి అధికారి వీరారెడ్డి, ఐ.టి అధికారి రాజేష్ మరియు జూనియర్ ఇన్స్పెక్టర్ ఉమేష్, అక్బర్ అలీ , జమదార్ సంక రాజేష్, తిరుపతి రాధాకృష్ణ సెక్యూరిటి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లాలో మొలుస్తున్న గంజాయి

**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**



మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధి అన్నోజిగూడ లక్ష్మీనరసింహ కాలనీలో పొడి గంజాయితో మహేష్ (22) అనే యువకుడు గురువారం పట్టుబడ్డాడు. సుమారు 1కేజీ పొడి గంజయి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరకు నుండి మహేష్, తన ముగ్గురు స్నేహితులతో కలిసి ఎవరికి వారుగా పొడి గంజా తీసుకొచ్చినట్లు సమాచారం. పోలీసుల అదుపులో ఉన్న మహేష్, మరో ముగ్గురి కోసం ఆరా తీస్తున్నారు పోలీసులు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోచారం ఐ.టి,కారిడార్ పోలీస్ స్టేషన్ ఎస్. హెచ్.ఓ శ్రీ రాజు గారు మీడియాతో మాట్లాడుతూ చట్ట వ్యతిరేక పనులకు పాల్పడే ఇటువంటి వ్యక్తుల సమాచారం మాకు తెలిజెఆయాలని శ్రీ రాజు గారు అన్నారు. నేరాల అదుపుకు ప్రజల సమాచారం,సహకారం అవసరమని శ్రీ రాజు గారన్నారు.

# నాకు కావాల్సింది ఒక్క బ్రేక్..



"నా కెరీర్‌లోనే భారీ చిత్రం 'జీబ్రా'. ఆర్థిక నేరాల నేపథ్యంలో అల్లుకున్న కథతో రూపొందింది. దీనికోసం ఓ అద్భుతమైన ప్రపంచాన్ని సృష్టించాం. అది ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది" అన్నారు సత్యదేవ్. ఆయన.. డాలీ ధనంజయ ప్రధాన పాత్రల్లో ఈశ్వర్ కార్తీక్ తెరకెక్కించిన చిత్రమే 'జీబ్రా'. ఇది నేడు విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు సత్యదేవ్ "బ్లాక్ మనీ.. వైట్ మనీ చుట్టూ తిరిగే కథ ఇది. అలాగే సినిమాలో చివరి వరకు ఎవరు మంచి.. ఎవరు చెడన్నది తెలియదు. ప్రతి పాత్రలోనూ గ్రేషేడ్ కనిపిస్తుంటుంది. అందుకే వీటన్నింటినీ ప్రతిబింబించేలా 'జీబ్రా' అనే పేరు పెట్టాం. దీనికి 'లక్కీ భాస్కర్'కు ఏ పోలిక ఉండదు. అది పీరియాడిక్ కథ. ఇది వర్తమానంలో జరిగే స్టోరీ. ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థ అంతా డిజిటల్ అయిపోయింది. ఇప్పుడు క్రైమ్ చేయడం అంత తేలిక కాదు. బ్యాంకుల్లో పని చేసే వాళ్లకు తప్పితే సామాన్యులకు అక్కడ జరిగే తప్పుల గురించి తెలియవు. మా దర్శకుడు ఈశ్వర్ గతంలో బ్యాంకులో పని చేశాడు. అలా తను చూసిన కొన్ని వాస్తవ సంఘటనల్ని స్ఫూర్తిగా తీసుకునే ఈ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు". "ఈ పరిశ్రమలో నిలదొక్కుకోవాలంటే ప్రత్యేకంగా ఏదోకటి చేయాలి. ఏ పాత్రనైనా చేయగలుగుతామని నిరూపించుకోగలగాలి. దీని వల్ల నన్ను హీరోగా కాక మంచి నటుడిగా గుర్తించినా ఫర్వాలేదు. ఆ గుడ్‌విల్ అంతా ఈ చిత్రంతో వర్కవుటయితే చాలు. అంతిమంగా నాకు కావాల్సింది ఒక్క బ్రేక్.. ఒక్క శుక్రవారం. అలాంటి నాదైన రోజు వచ్చే వరకు నేను ఈ ట్రాక్ మీద ఎదురు చూస్తుండాలి. అలా కాదని పక్కకొస్తే మన పని అయిపోయినట్లే. నేనైతే నా ట్రాక్ మీద ఉన్నాననే అనుకుంటున్నా. నాకంటూ మంచి శుక్రవారం తగిలినప్పుడు పూర్తిగా హీరో పాత్రలతోనే కొనసాగుతా". "ఈ చిత్రంలో నేను బ్యాంక్ ఉద్యోగిగా కనిపిస్తా. అలాగే ధనంజయ గ్యాంగ్‌స్టర్‌గా కనిపిస్తాడు. బ్యాంకులో అనుకోకుండా జరిగిన చిన్న పొరపాటు వల్ల మా రెండు ప్రపంచాలు ఎలా కలిశాయన్నది ఆసక్తికరంగా ఉంటుంది. సాధారణంగా ఇలాంటి కామన్‌మ్యాన్ కథల్లో హీరో గెలవాలని ప్రతి ప్రేక్షకుడు కోరుకుంటుంటాడు. అలా అందరికీ కనెక్ట్ అయ్యే పాయింట్ ఈ చిత్రంలో ఉంది. నేనిలాంటి బ్యాంకర్ పాత్ర ఇప్పటి వరకు చేయలేదు. దీని కోసం నా లుక్ కూడా మార్చుకున్నా

## ఉత్తమ స్కోర్‌గా

## ఏఆర్ రెహమాన్‌కు పురస్కారం



ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ 'ది గోట్ లైఫ్' చిత్రానికి గానూ ఇండిపెండెంట్ ఫిల్మ్ అవార్డును అందుకున్నారు. హాలీవుడ్ మ్యూజిక్ ఇన్ మీడియా అవార్డ్స్‌లో ఈ సినిమాకు నేపథ్య సంగీతం అందించినందుకు స్కోర్ ఇండిపెండెంట్ ఫిల్మ్ (విదేశీ భాష) విభాగంలో ఈ పురస్కారాన్ని గెలుచుకున్నారాయన. లాస్ ఏంజెలీస్‌లో జరిగిన ఈ వేడుకలో రెహమాన్ తరఫున 'ది గోట్ లైఫ్' దర్శకుడు బ్లెస్సీ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్టా వేదికగా ఓ వీడియో పెట్టారు రెహమాన్. "విదేశీ భాషా చిత్రం 'ది గోట్ లైఫ్'కి ఉత్తమ స్కోర్‌గా అవార్డును అందుకోవడం అపురూపమైన గౌరవం. దీని ప్రత్యేకతను గుర్తించినందుకు హాలీవుడ్ మ్యూజిక్, మీడియా పురస్కారాలకు నా ధన్యవాదాలు. నా అద్భుతమైన సంగీత విద్వాంసులు, సాంకేతిక నిపుణుల బృందం, కథకు జీవం పోసిన దర్శకుడు ఇలాంటి గొప్ప క్షణాలను అందించడంలో ఎంతో సహకరించార"ని అన్నారు. .

## మరపురాని ప్రయాణం



మోహన్‌బాబు యాభయ్యేళ్ల సినీ ప్రయాణాన్ని పురస్కరించుకుని వచ్చే ఏడాది నవంబరు 22 వరకూ ప్రతి నెలా ఓ వేడుకని నిర్వహిస్తున్నట్టు ఓ ప్రకటనలో తెలిపారు మంచు విష్ణు. మోహన్‌బాబు తన నట ప్రయాణంలో నేడు 50వ వసంతంలోకి అడుగు పెట్టారు. 1975 నుంచి 1990 వరకూ మోహన్‌బాబు భారతీయ సినిమాల్లో ప్రతినాయక పాత్రలకి కేరాఫ్‌గా నిలిచారు. 1990 దశకంలో కథానాయకుడిగానూ అలరించారు. 570కిపైగా సినిమాల్లో నటించి ఆ పాత్రలకి జీవం పోశారు. సినీ నిర్మాణంలోనూ ఆయనది ప్రత్యేకమైన ప్రయాణమే . ఓ నటుడు నిర్మాతగా మారి 75 చిత్రాల్ని రూపొందించిన ఘనత ఆయనకి దక్కుతుంది. సినిమా రంగంలో ఆయన చేసిన సేవకిగానూ పద్మశ్రీ పురస్కారంతో పాటు పలు గౌరవాల్ని సొంతం చేసుకున్నారు. మోహన్‌బాబు ప్రస్తుతం తన కుమారుడు మంచు విష్ణు కలల చిత్రం 'కన్నప్ప'లో మహాదేవ శాస్త్రిగా కీలక పాత్రని పోషిస్తున్నారు. ఈ సినిమాకి మోహన్‌బాబు నిర్మాత కూడా.

## మరో డిఫరెంట్ కథతో విశ్వక్‌సేన్

# మెకానిక్ రాకీతో మెప్పించే యత్నం




మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ కెరీర్ బిగినింగ్ నుంచి కాస్త విభిన్నమైన కథలే ఎంచుకుంటున్నాడు. జయాపజయాలతో పని లేకుండా తనవంతుగా ఏదో ఒక కొత్త ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. జనాల నోటిలో తన సినిమా ఉండేలా ప్రమోషన్స్ కూడా ప్లాన్ చేసుకుంటాడు. ఇటీవల ఆయన నుంచి వచ్చిన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' నిరుత్సాహ పరిచింది. ఈసారి ఎలాగైనా హిట్టు కొట్టాలనే తపనతో చేసిన చిత్రం 'మెకానిక్ రాకీ'. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం కూడా కొంత డిఫరెంట్‌గా ఉందని టాక్. రాకీ అంతంత మాత్రంగా చదివే ఓ కుర్రాడు. తండ్రి రామకృష్ణ(నరేష్)కు ఓ మెకానిక్ గ్యారేజీ కమ్ డ్రైవింగ్ స్కూల్ ఉంటుంది. చదువు మీద శ్రద్ధలేకపోవడంతో రాకీ కూడా తండ్రి నడిపే షెడ్ పని చేయాల్సి వస్తుంది. తను నడిపే డ్రైవింగ్ స్కూల్‌కి రాకీ స్నేహితుడు శేఖర్ చెల్లి ప్రియా (మీనాక్షి చౌదరి) మాయ (శ్రద్దా శ్రీనాథ్) డ్రైవింగ్ నేర్చుకోవడానికి వస్తారు. రాకీ షెడ్డు ఉన్న స్థలంపై రంకి రెడ్డి (సునీల్) కన్ను పడుతుంది. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఆ స్థలం కాజేయాలనుకొంటాడు. దాన్ని అడ్డుకోవాలంటే రాకీకి రూ.50 లక్షలు కావాలి. మరి ఆ రూ.50 లక్షలు ఎలా సంపాదించాడు? రాకీ స్నేహితుడు శేఖర్ ఎందుకు చనిపోయాడు? ఇన్సూరెన్స్ పేరుతో జరిగిన స్కామ్‌లో మాయ (శ్రద్దా శ్రీనాథ్) పాత్ర ఏంటి? అన్నది తెరపైనే చూడాలి. ఇక ఆత్మహత్యతో సినిమా ప్రారంభమవుతుంది. చనిపోయింది ఎవరు.. ఏంటి అనేది చెప్పకుండా కాసేపు అంతా సీరియస్‌గా నడుస్తోంది. ఆ తదుపరి హీరో రాకీ కథలోకి ఫన్నీగా తీసుకెళ్లాడు దర్శకుడు. మొదటిభాగం అంతా రాకీ కాలేజ్, ప్రియాతో ప్రేమ, తండ్రితో తిట్లు.. గ్యారేజ్ గొడవ, దానిని కాపాడుకోవడానికి పడే పాట్లతో ఫస్టాఫ్ ముగుస్తుంది. అంతకు మించి ప్రథమార్థంలో ఆసక్తికర అంశాలు లేదు. హీరోయిన్ మీనాక్షి చౌదరిని పిసినారిగా చూపించడం కాస్త ఫన్ క్రియేట్ చేసింది. దొంగ బ్యాగ్ కొట్టేసే సీన్ నవ్వులు పూయిస్తుంది. సెకండాఫ్ ప్రారంభంలో అసలు కథ మొదలవుతుంది. ఫస్టాఫ్ అంతా ఫన్ రైడ్‌తో లవ్‌స్టోరీలాగా నడిచిన కథ ఒక్కసారి టర్న్ అవుతుంది. లవ్ జానర్ అనుకున్న కథ క్రైమ్ జానర్‌లో సాగే థ్రిల్లర్‌గా మారిపోతుంది. మొదటి ట్విస్ట్‌తో కథ ఏంటి అనేది అర్థమవుతుంది. సెకండ్ ట్విస్ట్ ప్రేక్షకుడి ఊహకు అందనిదే. ఆ విషయంలో పాత్రల్ని ట్విస్ట్‌లకు అనువుగా వాడుకోవడం బాగుంది. ఫస్టాఫ్ సాగదీతగా సాగడంతో ద్వితీయార్థమే సినిమాకు బలంగా నిలిచింది. మధ్య తరగతి ఆశ, అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు చేసే మోసాలను ఇందులో చూపించారు. ఇన్సూరెన్స్ పేరుతో జరుగుతున్న సైబర్ క్రైం, ఆ మోసగాళ్ల ప్లాన్స్ ఎలా ఉంటాయనేది.. దానిలో ఎత్తులు, పైఎత్తులను బాగా డీల్ చేశారు. కొన్ని సన్నివేశాల్లో ఇలా కూడా జరుగుతుందా అనిపిస్తుంది. అయితే అక్కడక్కడ సహజత్వం లోపించింది.నటీనటుల పనితీరుకొస్తే.. విశ్వక్ ఎనర్జీ ఎనర్జీని దర్శకుడు బాగా వాడుకున్నాడు. సినిమా మొత్తం అతని చుట్టూ తిరుగుతుంది. తనదైన మాస్ స్టైల్‌ని చూపించాడు. మాస్ డైలాగులు తనదైన స్టైల్‌లో చెప్పి మెప్పించాడు. మీనాక్షి చౌదరి పద్ధతి గల పాత్రలో మెప్పించింది. ఆ పాత్రలతో పాటు శ్రద్దా శ్రీనాథ్ చేసిన పాత్ర కూడా సినిమాకు కీలకం. గ్లామర్‌కు పరిమతం కాకుండా ఇద్దరి పాత్రలకు పాధాన్యం కల్పించారు. నరేష్ తన పాత్ర మేరకు నటించారు. వైవా హర్ష కొన్ని చోట్ల నవ్వించాడు. హర్షవర్ధన్ పాత్ర ఫర్వాలేదు. సునీల్‌ని మొదట్లో పెద్ద డాన్‌లా చూపించి పిల్లిని చేసేశారు. ఇక దర్శకుడు రవితేజకు ఇది తొలి సినిమా.రాసుకున్న కథ, తను చెప్పాలనుకున్నది కరెక్ట్‌గానే ఉన్నా.. అక్కడక్కడా తడబాటు కనిపించింది. తను పూర్తి సెకెండాఫ్ ట్విస్ట్‌ల మీదే ఆధారపడినట్లు అనిపించింది. ఫస్టాఫ్‌కు ఇంకాస్త వర్క్‌వుట్ చేసి ఎమోషన్స్ జోడించి ఉంటే బావుండేది. సెకండాఫ్‌ని డీల్ చేసిన పద్ధతి బాగుంది. పూర్తిగా ట్విస్టుల్ని నమ్ముకొన్న కథ కావడంతో ఆ ట్విస్ట్‌ల కోసం ఫస్టాఫ్ ఓపికగా చూడాలి.

### రష్మికతో ప్రేమలో పడ్డ విజయ్

## అసు విషయం చెప్పకనే చెప్పేసిన రౌడీబాయ్





రౌడీ బాయ్ 'విజయ్ దేవరకొండ' ఎట్టకేలకు రష్మికతో తన బంధాన్ని బయట పెట్టాడు. ఇటీవల రిలీజైన 'సాహిబా' సాంగ్ ప్రమోషన్స్ లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్టార్ కంపోజర్ జస్లీన్ రాయల్ తో పాటు హీరోయిన్ రాధికా మదన్ పాల్గొని విజయ్ లవ్ లైఫ్ సీక్రెట్స్ ని బయటపెట్టారు. దీంతో ఎట్టకేలకు రష్మిక, విజయ్ సంబంధం ఏంటో తెలిసిపోయింది అంటున్నారు ఫ్యాన్స్. ఇంతకీ విజయ్ ఏమన్నారంటే..-హాలీవుడ్ సెన్సేషనల్ మ్యూజిక్ కంపోజర్ జస్లీన్ రాయల్ 'హీరియే హీరియే' సాంగ్ సక్సెస్ తర్వాత విజయ్ దేవరకొండ, రాధికా మదన్ కాంబినేషన్ లో 'సాహిబా' సాంగ్ రూపొందిచిన విషయం తెలిసిందే. ఈ సాంగ్ మంచి వ్యూస్ సంపాందించుకొని యూట్యూబ్ లో దూసుకుపోతున్న నేపథ్యంలో టీమ్ చిట్ చాట్ నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే టీమ్ విజయ్ ని లవ్ రిలేషన్షిప్ గురించి అడిగారు. విజయ్ ఆ ప్రశ్నలకి ఆసక్తికరమైన సమాధానాలు చెప్పారు. ఆయన మాట్లాడుతూ.. 'నేను నా కో స్టార్ ఒకరితో డేటింగ్ లో ఉన్నాను. నా వయసు 35, నేను ఒంటరిగా ఉంటానని మీరు ఎలా భావించారు. రొమాంటిక్ రిలేషన్షిప్ లోకి వెళ్లేముందే నేను ఆ వ్యక్తులతో క్లోజ్ గా ఫ్రెండ్షిప్ చేస్తాను. నేను ప్రత్యేకించి డేట్‌లకు వెళ్యాను, ఎవరితోనైతే చాలా కాలం నుండి ఫ్రెండ్షిప్ ఉంటాదో వాళ్ళతోనే బయటకెళ్తాను. నాకు షరతులు లేని ప్రేమ కావాలి. నాకు ప్రేమించడం తెలుసు, ప్రేమను తీసుకోవడం తెలుసు' అన్నారు. అయితే ఇప్పటికే రశ్మికకి, విజయ్ కి మధ్యలో మంచి స్నేహం ఉంది. దీపావళి కూడా కలిసి సెలబ్రేట్ చేసుకున్నారు. దీంతో విజయ్, రష్మికతో రిలేషన్షిప్ లో ఉన్నట్లు ఫిక్స్ చేసేస్తున్నారు నెటిజన్లు.